## ఉపకరణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, జూన్ 9 : అర్హులైన దివ్యాంగుల నుంచి ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ, తెలంగాణ వికలాంగుల సహాయక సమితి ద్వారా జిల్లాలోని ప్రతీ దివ్యాంగుడికి ఉపకరణాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాకు 45 రెట్రోఫిట్మెంట్ స్కూటీలు, 14 బ్యాటరీ వీల్ చెయిర్లు, 18 మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిళ్లు, తదితర ఉపకరణాలు మంజూరయ్యాయని వివరించారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు హెల్ప్‌లైన్ 155326 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం ఒకేసారి 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నదని పేర్కొన్నారు. రేషన్ కార్డుదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ చౌకధరల దుకాణాల నుంచి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. తహసీల్దార్లు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నేతృత్వంలో తమ పరిధిలో రేషన్ బియ్యం పంపిణీని పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 43.33 శాతం బియ్యం పంపిణీ జరిగిందని వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**ఇంటర్‌లో ప్రవేశాలకు..**

బెల్లంపల్లి, జూన్ 9 : బెల్లంపల్లి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి మైనార్టీ విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ నీలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 12వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మంత్రి పదవి రాకపోవడంపై అసంతృప్తి లేదు

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్

లక్షెట్టిపేట, జూన్ 9: 'కార్యకర్తలే నా బలం..బలగం.. వారి కోసం నా రక్తం చివరి బొట్టు వరకు శ్రమిస్తా.. నాకు మంత్రి పదవి రాకపోవడంపై అసంతృప్తి లేదు' అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన కళాశాల, దవాఖాన భవనాలను సోమవారం ఆయన పరిశీలించారు. 'నాకు పదవులు, డబ్బు ముఖ్యం కాదు. కార్యకర్తల బాగోగులే ముఖ్యం. ఈ ప్రాంత అభివృద్ధి నా కల' అని అన్నారు. మంత్రి పదవిని ఆశించామని కానీ, సమీకరణాలతో తనకు దక్కలేదని, అయినా అసంతృప్తి లేదని పేర్కొన్నారు. అధిష్టానం న్యాయం చేస్తుందనే నమ్మకం ఉందన్నారు. రెండు వారాల్లో ఏదో ఒకటి తేలుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిందంటే తానే కారణమని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ చైర్మన్ కోట్నాక తిరుపతి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, డీసీసీ ఉపాధ్యక్షుడు చింత అశోక్, పార్టీ మండలాధ్యక్షుడు పింగళి రమేశ్, పట్టణాధ్యక్షుడు ఆరిఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్షర చైతన్య యాత్ర అభినందనీయం

కెరమెరి, జూన్ 9 : 'విద్యతోనే విముక్తి' అని బలంగా నమ్మి ఆదివాసీ ప్రాంతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ చేపట్టిన అక్షర చైతన్య యాత్ర అభినందనీయమని రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ సలహాదారుడు ఆర్ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని జోడేఘాట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధికారులు, సంఘాల ప్రతినిధులతో కలిసి భీం విగ్రహం, సమాధి వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 15 మండలాల్లో 15 గ్రామాల ప్రజలను పాదయాత్ర ద్వారా చైతన్యం చేసి, ప్రభుత్వ బడుల పటిష్టతకు పాటు పడాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతంలో రాష్ట్ర ప్రణాళికతో ముడిపెట్టకుండా ఆదివాసీ విద్యా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మండలం ఒక యూనిట్‌గా తీసుకోవాలని తెలిపారు. డీఎంహెచ్‌వో కుమ్రం సీతారాం, గ్రామ పటేల్ పెందోర్ రాజేశ్వర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కడేర్ల రంగయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ పాల్గొన్నారు.

## వెంకటాపూర్ జీపీ పరిశీలన

మందమర్రి రూరల్, జూన్ 9 : మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీని మంచిర్యాల డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ ధర్మరాణి సోమవారం తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రికార్డులు, నర్సరీ, శానిటేషన్ పనులు పరిశీలించారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామంలోని పరిసరాలు దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. గ్రామస్తులకు వ్యాధులు సోకకుండా వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పంచాయతీ కార్యదర్శికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

## 15 నుంచి ఇన్‌స్పైర్ నామినేషన్లు

నస్పూర్, జూన్ 9 : ఇన్‌స్పైర్ నామినేషన్లు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, ఈసారి ఇంటర్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే ప్రాథమిక లక్ష్యంతో సైన్స్, టెక్నాలజీ శాఖ అమలు చేసే ప్రధాన కార్యక్రమమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 5 లక్షలకు పైగా మిడిల్, హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల నుంచి పది లక్షల వినూత్న ఆలోచనలను లక్ష్యంగా చేసుకొని రూపొందించారని వివరించారు. ఈవిషయాన్ని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, అన్ని యాజమాన్య ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు గమనించాలని సూచించారు.

## పారిశుధ్యంపై ఒకరోజు శిక్షణ

నస్పూర్, జూన్ 9 : స్థానిక జడ్పీ పాఠశాలలో నిర్వహించిన పాఠశాలల పారిశుధ్యంపై ఒకరోజు శిక్షణకు జిల్లాలోని ప్రతీ మండలం నుంచి ఒక రిసోర్స్ పర్సన్ టీచర్, ఇద్దరు శానిటేషన్ వర్కర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య పాల్గొని, మాట్లాడారు. పాఠశాలల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియజేశారు. ట్రైనింగ్ పొందిన టీచర్లు, శానిటేషన్ వర్కర్లు, ఆయా మండలాల్లోని పాఠశాలల్లో సంబంధిత శానిటేషన్ వర్కర్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

## నానో యూరియా వినియోగంపై అవగాహన

మందమర్రి రూరల్, జూన్ 9 : మండలంలోని గుడిపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నానో యూరియా వినియోగంపై రైతులకు మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు. నానో యూరియా సాధారణ యూరియా బస్తాతో పోల్చితే తక్కువ పరిమాణం కలిగి, అంతేస్థాయి పోషకాలు అందిస్తుందన్నారు. తక్కువ ధరలో ఎక్కువ పోషకాల లభ్యతతో పాటు పొలానికి అందించేందుకు సులువుగా ఉంటుందని, నానో యూరియా ద్రవ రూపంలో ఉండి పైపాటుగా పంటపై పిచికారీ చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో పాటు, సమయం ఆదా అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సైన్ల కనకరాజు రైతులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన

బెల్లంపల్లి, జూన్ 9 : బెల్లంపల్లి పట్టణంలోని నాల్గోవార్డు బెల్లంపల్లి బస్తీలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తడి, పొడి చెత్త వేరు చేసే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, సీవో కిషోర్, ఆర్పీ సుజాత, కార్యాలయ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావం

నస్పూర్ , జూన్ 9 : విద్య, ఉపాధ్యాయ రంగ శ్రేయస్సు కోసం పనిచేయడమే ఎస్టీయూ లక్ష్యమని సంస్థ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎస్టీయూ 79వ ఆవిర్భావ వేడుకలను స్థానిక ఎస్టీయూ భవన్‌లో సోమవారం నిర్వహించారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బకాయిలు, ఆరోగ్య కార్డులు, తదితర అంశాలపై రానున్న రోజుల్లో పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీపెల్లి బాపు, బీసగోని అంకినీడు, కొండు భీంరావు, కోటేశ్వర రావు సన్మానించారు.

# కాలం కలిసొచ్చేనా..!

## రెండేళ్లుగా సకాలంలో కురవని వానలు

- ఇంకా పూర్తిగా అందని రైతుబంధు
- రైతులకు పెను సవాలుగా పెట్టుబడి

*చినుకు రాలుతుందో లేదో అనే చింత.. నకలీ విత్తనాలు ఎక్కడ కొంప ముంచుతాయో అనే బెంగ.. పంట ఎదిగే క్రమంలో ఎరువులు దొరకుతాయో లేదో అన్న ఆందోళన.. పెట్టుబడికి పంట రుణాల కోసం ఎదురు చూపు.. ఇలా ఆశ నిరాశలతో పుడమి కడుపున బంగారం పండించాలన్న సంకల్పంతో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రైతులు వానకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రెండేళ్లుగా సకాలంలో వానలు కురవకపోవడం.., రైతుబంధు పూర్తిగా, సమయానికి అందకపోవడం.. పెట్టుబడికి పెను సవాలుగా మారింది.*

**- మందమర్రి రూరల్, జూన్ 9**



పొన్నారం గ్రామంలో దుక్కి దున్నుతున్న ట్రాక్టర్

ఏటా నష్టాలు, కష్టాలు ఎదురవుతున్నా భూమినే నమ్ముకున్న రైతులు.. ఇప్పుడైనా కలిసిరాకపోతుందా అనే ఆశతో వానకాలం సాగుకు సన్నద్ధమయ్యారు. రోహిణి కార్తె ప్రారంభంతోనే దుక్కులు సిద్ధం చేసుకున్నారు. సాగు సమయం దగ్గర పడుతున్నా పెట్టుబడికి రైతుబంధు సాయం అందలేదు. సమయానికి వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే రెండేళ్లు పంట నష్టపోయారు. మందమర్రి మండలంలో 6,700 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ వానకాలంలో 13,200 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా పత్తి 6,500 ఎకరాలు, వరి 6,200 ఎకరాలు, మరో 500 ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని అంచనా. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు, సిద్ధం చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. దీంతో ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. త్వరగా సమయానికి రైతుబంధు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

### ❖ నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి..

రైతులు ఈ వానాకాలం సీజన్‌లో సాగుకు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లులు తీసుకోవాలి. లూజు విత్తనాలు వాడితే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. డీఏపీ, ఎస్‌ఎస్పీ ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. లేకపోతే విత్తనాలు మొలకెత్తవు. మంచి వర్షం పడిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలి.



**- కిరణ్మయి, మండల వ్యవసాయ అధికారి, మందమర్రి**

**పరిహారం పరిహాసమే..**

ప్రకృతి వైపరీత్యాలతో ఏటా పంటలు దెబ్బతింటున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులను ఆదుకునేందుకు పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకం అమలు కావడం లేదు. ఈ ఏడాది ఫసల్ బీమా అమలు రైతులకు ఊరటనిచ్చే అంశం. గతంలో పంటలు నష్టపోతే రైతులకు పరిహారం అందిన దాఖలాలు లేవు. వ్యవసాయాధికారులు నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి పంపినా రైతులకు మాత్రం పరిహారం రాలేదు. ఈ ఏడాదైనా కాలం కనికరించి, దిగుబడులు పెరుగుతాయనే ఆశతో రైతులు పొలం బాట పడుతున్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించండి



హాజీపూర్ : బాబానగర్‌లో ర్యాలీ తీస్తున్న ఎంఈవో తదితరులు



మందమర్రి : ఉపాధ్యాయులకు దరఖాస్తు ఇస్తున్న శ్రీనివాస్ దంపతులు

హాజీపూర్, జూన్ 9 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని హాజీపూర్ మండల విద్యాధికారి తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని బాబానగర్‌లో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బడీడు పిల్లలందరినీ పాఠశాలకు పంపించాలని తల్లితండ్రులను కోరారు. మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మ వెంకటేశం, ఉపాధ్యాయురాలు సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

దండేపల్లి, జూన్ 9 : దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కర్ణపేట, సామగూడ, ఎస్సీకాలనీ విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, ఉచిత వసతులు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


బాడీడు పిల్లలను బాడిబాట పట్టించాలి

కోటపల్లి, జూన్ 8 : మండలంలోని సర్వాయిపేట గ్రామంలో కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బిల్ల తిరుపతయ్య, కరీం సాబీర్, సర్వాయిపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, పర్వీనా బడిబాట నిర్వహించారు. విద్యార్థులను కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

మందమర్రి, జూన్ 9 : మందమర్రి పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేశారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దూలం శ్రీనివాస్ ఇంటికి వెళ్లగా, ఆయన తన ఇద్దరు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు దరఖాస్తులు సమర్పించారు. ఫిల్టర్‌బెడ్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులపై నమ్మకంతోనే తన కూతురు అద్వైత, కొడుకు విప్లవ్‌ను పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణకు చర్యలు

**క్షయ నివారణ మంచిర్యాల జిల్లా అధికారి సుధాకర్ నాయక్**



స్థానికులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సీసీసీ నస్పూర్, జూన్ 9 : క్షయ నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు క్షయ నివారణ మంచిర్యాల జిల్లా అధికారి సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. నస్పూర్ పట్టణంలోని సీతారాంపల్లి గ్రామంలో సోమవారం క్షయ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. రెండు వారాలకుపైగా దగ్గు లక్షణాలుంటే క్షయగా అనుమానించాలన్నారు. జిల్లాలోని ప్రతీ ఆరోగ్య కేంద్రంలో నిర్ధారణకు తెమడ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స అందిస్తూ, పూర్తయ్యే దాకా ప్రతి నెలా పోషణ భత్యం కింద ప్రభుత్వం రూ.వెయ్యిఅందిస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందన్నారు. నిర్ధారణ అయిన వెంటనే చికిత్స అందిస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి, మద్యం సేవించే, పొగాకు నమిలే వారికి ఎక్కువగా సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే అవసరం ఉన్నవారిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాకు తరలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు, జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సురేందర్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ అక్తర్ ఉన్నీసబేగం, ల్యాబ్ సూపర్‌వైజర్ వేణు, టీబీ హెచ్‌వీ స్వప్న, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్, జూన్ 9: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని కలెక్టరేట్‌లో మచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ మండలం ఒత్కులపల్లికి చెందిన మద్దూరి అఖిల ఇందిరమ్మ ఇల్లు కోసం అర్జీ ఇచ్చింది. బెల్లంపల్లిలోని సుభాష్‌నగర్, ఇంక్లైన్ బస్తీకి చెందిన కాలనీ వాసులు భూ కబ్జాలపై ఫిర్యాదు చేశారు. కాసిపేట మండలం దుబ్బగూడేనికి చెందిన ప్రజలు. తమ భూములు ఓపెన్ కాస్టులో పోయాయని, నష్టపరిహారం ఇప్పించాలని విన్నవించారు. వికలాంగ పింఛన్ ఇప్పించాలని, పారుపల్లికి నిమ్మల బాపు కోరాడు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, జూన్ 9 : ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం మోహన్ పేర్కొన్నారు. చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో సమస్యలపై వచ్చిన రెండు అర్జీలను స్వీకరించారు. ఎంపీవో ఎండీ అజ్మత్ అలీ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట, జూన్ 9 : కాసిపేట మండలం ధర్మారావుపేటలో గల కిరాణా దుకాణాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త లెక్కల వెంకటయ్య కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీకి వినతి పత్రం అందించారు. మద్యం అమ్మకాలతో పాటు బెల్లం పటిక అమ్మకాలు జరుపుతున్నారని, ఐదు గుడుంబా కేంద్రాలు పెట్టారని పేర్కొన్నారు. ధర్మారావుపేట, మల్కెపల్లి, రొట్టెపల్లి, తిరుమలాపూర్ గ్రామాలకు లంబాడీ తండా(డీ) నుంచి గుడుంబా సరఫరా చేస్తున్నారని తెలిపారు. సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



నస్పూర్ : అర్జీలు స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## బదిలీ డీవైపీఎం అధికారికి సన్మానం



ఖైర్‌గూడ ఓసీపీలో బదిలీ అధికారి వేణును సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన, జూన్ 9 : బెల్లంపల్లి ఏరియా ఖైర్‌గూడ ఓసీపీలో డీవైపీఎంగా సేవలు అందించి రామగుండం–1 ఏరియా కు బదిలీపై వెళ్తున్న నాగుల వేణును సోమవారం ఖైర్‌గూడ ఓసీపీ వద్ద టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందించి, సత్కరించారు. ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సభ్యులు కార్నాథం వెంకటేశం, గజ్జెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, జే మురహరిరావు, సీ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జి సాలిగామ రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానించినట్లు ఖైర్‌గూడ ఓసీపీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తెలిపారు. గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జూపాక రాజేశ్, కిరణ్‌బాబు, సేఫ్టీ, మైన్స్ కమిటీ సభ్యులు సత్తయ్య, సత్యనారాయణ, కోటి, నరేశ్, నాయకులు రాజు, రారాజు, ఖాసీం అలీ, శంకర్, సుధాకర్, అంజయ్య, శ్రీనివాస్, హర్షద్‌బాబా, సురేశ్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల రక్షణ బాధ్యత సింగరేణిదే

మందమర్రి, జూన్ 9 : ఉద్యోగుల రక్షణ బాధ్యత సింగరేణిదేనని, అందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని మందమర్రి ఏరియా జీఎం జీ దేవేందర్ అన్నారు. మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక భద్రత అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫాటల్ ఫ్రీ జూన్–2025 నెలగా మార్చేందుకు ఉద్యోగులందరూ రక్షణతో కూడిన పనులు చేయాలని సూచించారు. యేటా జూన్‌లో సింగరేణి ఏదో ఒకచోట ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. నివారణకు కోసం మూడేళ్లుగా జూన్‌లో ఫాటల్ ఫ్రీ జూన్ పేరుతో అవగాహన పెంచుతున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఇంటి నుంచే రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి, సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం ఉద్యోగులతో కలసి అధికారులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) రఘుకుమార్, ఏజీఎం(ఈఅండ్ఎం) వై వెంకటరమణ, వర్క్‌షాప్ ఇన్‌చార్జి ధూప్ సింగ్, మందమర్రి ఏరియా రక్షణాధికారి మాటూరి రవీందర్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, పిట్ కార్యదర్శి ప్రభాకర్‌శర్మ, అధికారులు దండె సదానందం, హరికృష్ణ, నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

## మంచిర్యాల హైటెక్ సిటీలో చోరీ

మంచిర్యాల అర్బన్, జూన్ 9 : మంచిర్యాల హైటెక్‌సిటీలోని ఏషియన్ టవర్స్‌లో చోరీ జరిగినట్లు టౌన్ ఎస్‌ఐ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన భూపెల్లి సుధాకర్ ఏషియన్ టవర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 6న గ్రీన్‌సిటీలో నూతన గృహప్రవేశం చేశారు. అక్కడే ఉంటూ ఏషియన్ టవర్స్‌కు వెళ్లి వస్తున్నాడు. 8న రాత్రి చివరగా ఇంటికి తాళం వేసి వెళ్లాడు. 9న ఉదయం వచ్చి చూసేసరికి మెయిన్ డోర్ బెడం విరగొట్టి ఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని 123.25 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. కాగా, సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

## జన్నారం రేంజ్ ఆఫీసర్‌గా లక్ష్మీనారాయణ

జన్నారం, జూన్ 9 : డివిజన్‌లోని జన్నారం రేంజ్ ఆఫీసర్‌గా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొంతకాలంగా ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన కొద్ది నెలలుగా లీవ్‌పై వెళ్లారు. సోమవారం కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్‌ను కలిసి, కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.

## పిచ్చికుక్క దాడిలో గాయాలు

వేమనపల్లి, జూన్ 9 : వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామంలో పిచ్చికుక్క విధ్వంసం సృష్టించింది. ఆరేళ్లబాబుతో పాటు, నాలుగు దూడలపై దాడిచేసి, గాయపర్చింది. గ్రామంలో తిరుగుతూ పిచ్చికుక్క మొదటగా రెడ్డి మహేశ్ కొడుకును, ఆ తర్వాత పశువులను కరిచింది. వెంటనే ఈ విషయాన్ని సంబంధిత వైద్యాధికారులకు తెలియజేయడంతో చికిత్స నిర్వహించారు. గ్రామాల్లో పిచ్చికుక్కలను నియంత్రించి, రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పశువులు తరలిస్తున్న లారీ పట్టివేత

భీమారం, జూన్ 9 : మహారాష్ట్ర నుంచి లారీలో పశువులను తరలిస్తుండగా, లారీని పట్టుకున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు. రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా, 30 పశువులను తరలిస్తున్న లారీ కనిపించింది. డ్రైవర్ రుక్సాఖా పారిపోయే ప్రయత్నం చేయగా, పట్టుకున్నట్లు వివరించారు. పశువులను మహారాష్ట్ర నుంచి జగిత్యాలకు తరలిస్తున్నారని, ఆధారాలు లేకపోవడంతో వాహనం సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

నస్పూర్, జూన్ 9 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా శరత్ బాబు హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయి పోటీలకు హాజరైన క్రీడాకారులకు ఇబ్బందులేకుండా పోటీలు నిర్వహించామని జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు గాజుల ముఖేశ్ గౌడ్ తెలిపారు. ఈ పోటీలలో గెలిచిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పుల్లూరి సుధాకర్, బండ మీనారెడ్డి, కబీర్ దాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 9 : ఎరువులు, పత్తి విత్తనాల విక్రయాల్లో యజమానులు నిబంధనలు ఉల్లఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు ప్రశాంతరావు, వరుణ్‌ప్రసాద్ హెచ్చరించారు. జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణంలోని హనుమాన్ ట్రేడర్స్‌లో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, బిల్ బుక్స్, స్టాక్ వివరాలు పరిశీలించారు. వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోండి

తాండూర్, జూన్ 9 : ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ఎస్‌ఐ డీ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నచిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే కేసులు నమోదైన ఇరువర్గాల వారు రాజీచేసుకుంటే అందరికీ ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. రాజీమార్గమే రాజమార్గమని ఎస్‌ఐ తెలిపారు. మరిన్ని వివరాల కోసం తాండూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

## 15న మహా సభ

శ్రీరాంపూర్, జూన్ 9 : నస్పూర్ నర్సయ్య భవన్‌లో ఈ నెల 15న సీపీఐ పార్టీ నస్పూర్ మండల మహాసభ నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో నస్పూర్ మండలంలో అనేక పోరాటాలు చేసి, ప్రజల సమస్యలు పరిష్కరించామన్నారు. సభకు జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే శంకర్, కార్యవర్గ సభ్యులు సీతారామయ్య, జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ హాజరవుతారన్నారు. పార్టీ సమితి సభ్యులు లింగం రవి, పట్టణ కార్యదర్శులు మిర్యాల రాజేశ్వర్‌రావు, పూజారి రామన్న, బాకం శంకర్, బొడ్డు లచ్చన్న, రాకేశ్ పాల్గొన్నారు.

## రక్షణ గోడ నిర్మించాలి

రామకృష్ణాపూర్, జూన్ 9 : రామకృష్ణాపూర్ నుంచి మందమర్రి వెళ్లే రహదారి మార్గంలో పాలవాగు వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని ధర్మసమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా నాయకుడు నందిపాటి రాజు కోరారు. పాలవాగు వంతెనపై రక్షణ గోడ కూలిపోయి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ఈ వంతెనపై నుంచి వేలాది మంది ప్రజలు, కార్మికులు, బొగ్గు ట్రిప్పర్లు, బైకులు నిత్యం వెళుతూ ఉంటాయని పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో వాహనాలు అదుపుతప్పి వాగులో పడిపోయే ప్రమాదం ఉందిని తెలిపారు. ప్రమాదాలు జరుగకముందే సంబంధిత అధికారులు స్పందించి, వంతెనపై రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

## పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మందమర్రి, జూన్ 9 : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎలాంటి రోగ లక్షణాలు లేకపోయినా నెలనెలా వైద్య పరీక్షలు చేసుకోవాలని కార్మికులకు సూచించారు. కమిషనర్ తుంగపిండి రాజలింగు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, రెవెన్యూ ఆఫీసర్ కృష్ణప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ఎంఎ సమీర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ గోపీకృష్ణ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.